క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



పెదకాకాని: పెదకాకాని వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా, అత్తిలి మండలం, బల్లిపాడు గ్రామానికి చెందిన కాళ్ల రవితేజ(28) కోళ్ల ట్రాన్స్‌పోర్ట్ చేసి కంపెనీలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం బాయిలర్ కోళ్ల లోడుతో చిత్తూరుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రవితేజ(28) పనిచేస్తున్న లారీ పెదకాకాని వై జంక్షన్ వద్దకు చేరుకునే సరికి ఎదురుగా వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వేగం అదుపుచేయలేక ఆ లారీని ఢీ కొంది. తీవ్రగాయాలైన రవితేజ లారీలోనే మృతి చెందగా, క్లీనర్ పోసిబాబుకు స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

విజ్ఞాన్ వర్శిటీ విద్యార్థికి పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ విభాగానికి చెందిన విద్యార్థిని సంగుల నాగమణికి శనివారం విజ్ఞాన్ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. మల్టీ ఫంక్షనల్ అట్రిబ్యూట్స్ ఆఫ్ రేర్-ఎర్త్ సింగల్ అండ్ డబుల్-డోప్డ్ లెడ్-ఫ్రీ స్ట్రాన్షియం బిస్మత్ నియోబేట్ సిరామిక్ మెటీరియల్స్ అనే అంశంపై విద్యార్థిని పరిశోధన చేసిందని తెలియజేశారు. డాక్టరేట్ పొందిన నాగమణిని విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో పుష్ప యాగం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం శ్రీ గోదాదేవి అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా ఉదయం విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో ఆలయ ప్రధాన అర్చకులు మాధవస్వామి నిర్వహణలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో సూరెడ్డి రాంప్రసాద్, పద్మజ దంపతులు, దేవాలయ పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. గోదాదేవిని దర్శించుకుని, తీర్థప్రసాదాల్ని స్వీకరించారు.

'శ్రీ గోదా స్తుతిమాలిక' గ్రంథావిష్కరణ

పాత గుంటూరు: నగర సాహిత్య రంగ మహిళా విదుషీమణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి అని ఉపన్యాస భారతి మంచికంటి సత్యవతి పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పద్మావతి కల్యాణ వేదికపై శనివారం రంగనాయకి సంకలనం చేసిన 'శ్రీ గోదా స్తుతి మాలిక' గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. గుదిమెళ్ల కూర్మనాథస్వామి సభకు అధ్యక్షత వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు గ్రంథాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ దీవి నరసింహ దీక్షిత్ పుస్తక సమీక్ష చేశారు. అనంతరం అచ్యుతుని శ్రీ చిన్మయి నృత్య ప్రదర్శన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, కార్యదర్శి ఉమామహేశ్వరరావు, పలువురు కవులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం

గుంటూరు వెస్ట్: రిటైర్డ్ ఉద్యోగుల కనీస ఇబ్బందులను పెద్దమనస్సుతో అర్థం చేసుకుని సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఏపీ రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్ ఎస్.మోహన్ రావుకు వినతి పత్రం అందజేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ట్రెజరీ శాఖకు వచ్చిన మోహన్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తీవ్ర వృద్ధాప్యం కారణంగా కొందరు పెన్షనర్లు ఈకేవైసీ చేయలేకపోతున్నారన్నారు. వారి ని ఒత్తిడి చేయవద్దని కోరారు. ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ కానివారికి, కదలలేని వారికి ప్రత్యేక వి ధానం ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇన్‌కమ్ ట్యా క్స్ సమర్పించేందుకు వచ్చే నెలాఖరు వరకు అవకాశం కల్పించాలని కోరారు. ట్రెజరీ శాఖ డీడీ బి. రాజగోపాలరావు , విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పి.నాగరాజు, సీహెచ్ వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



వడ్లమూడిలో ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు



సర్టిఫికెట్‌లు అందజేస్తున్న జెడ్పీటీసీ గుల్జార్ బేగం



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రత్యేకాధికారి వజ్రశ్రీ, వైస్ ఎంపీపీ ఇంటూరి



ఆధార్‌కార్డ్, సర్టిఫికెట్‌ను షేక్ శహబాస్‌కు అందజేస్తున్న వైస్ ఎంపీపీ పద్మావతి

చేబ్రోలు: జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరమని, ప్రజలకు అవసరమైన సేవలను సత్వరం అందిస్తున్నట్లు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. ఎమ్మెల్యే కిలారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు అన్ని రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచిందన్నారు. పారదర్శకంగా 1.37లక్షల మంది గ్రామ సచివాలయ సిబ్బందిని నియమించటం జరిగిందన్నారు. 2.70లక్షల మంది వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నట్లు వివరించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని పిలిచి వారు అందిస్తున్న సేవలను తెలిపారు. సమావేశానికి వచ్చిన వారిలో ఎవరికైనా వలంటీర్ల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని ప్రశ్నించారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచటానికి నవరత్నాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వివిధ సాంకేతిక కారణాలు, ఇతర కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చటం కోసం జగనన్న సురక్ష పథకంను తీసుకురావటం జరిగిందన్నారు. వివిధ రకాల ధ్రువపత్రాలను అర్జీదారులకు అందజేశా రు. గ్రామ సర్పంచ్ ఎం అనితారాణి, జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బాబురావు, ఏపీఎం వి.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వైపీపీ ప్రసాద్, పార్టీ నాయకులు కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, షేక్ జానీ, పెద మస్తాన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.33కోట్లతో వడ్లమూడిలో అభివృద్ధి, సంక్షేమం

వడ్లమూడి అన్నపూర్ణమ్మ కాలనీలో రూ.30లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు సైడ్ కాలువలను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రూ.33కోట్లు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే కిలారి వివరించారు. రూ.2.5 కోట్ల వ్యయంతో సిమెంటు రోడ్లు, సైడ్ డ్రైయిన్లు, విద్యుత్ స్తంభాలు, రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. రూ.60లక్షల వ్యయంతో షాదీఖానా నిర్మాణం పూర్తి దశలో ఉందని, త్వరలో ప్రారంభోత్సవం చేయటం జరుగుతుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు పనితీరు పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు తెలియజేసిన సమస్యను పరిష్కరించటానికి నిధులు కేటాయిస్తే ఏఈ ఇష్టానుసారం పనులు చేయటం పట్ల ఎమ్మెల్యే కిలారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ వ్యవహార శైలిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

పొన్నూరు(చేబ్రోలు): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించటం జరుగుతుందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణ 23వ వార్డులోని 11 ,13 సచివాలయ పరిధిలో గల 20, 22, 23వ వార్డుల పరిధిలో శనివారం జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. ఈ సందర్భంగా 567 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సభకు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రోశయ్య ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. వడ్లముక్కల, కొండముది గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారం లక్ష్యం..

కొమ్మూరు(కాకుమాను): గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్థాయిలో పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. కొమ్మూరు గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ గతంలో ప్రజలకు ఎలాంటి సర్టిఫికెట్‌లు కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అలాంటి సమస్యను సీఎం వైఎస్ జగన్ పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ గేరా జ్యోతి మాట్లాడుతూ ప్రజలు వివిధ రకాల సర్టిఫికెట్‌ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇళ్ల వద్దకే పథకాలను, సేవలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా 2,312 మందికి వివిధ రకాల సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గేరా అలేఖ్య, ఉప సర్పంచ్ షేక్ జిలేఖ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓ కె.కిరణ్మయి, ఎంఈఓ కెఎఫ్.కెనడీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

గుంటూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ తెలిపారు. శనివారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో ఎంపీడీవో శోభారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇప్పటి వరకు పరిష్కారం కాని సాంకేతిక లోపాలున్న, ఇతర సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించటం జరుగుతుందన్నారు. మండల వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు ప్రతి ఒక్కరికి అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అందించటం జరిగిందన్నారు. పార్టీలకు, కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ వెంగళాయపాలెం గ్రామంలో 267 మంది ప్రజలు తమ సమస్యలను నమోదు చేసుకోగా మొత్తం 324 సేవలు ఉత్పన్నమయ్యాయన్నారు. అందులో 128 కుల ధ్రువీకరణ పత్రాలు, 148 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 1 పంటసాగు పత్రం, 14 ఆధార్ సేవలు 5 ఇతర సేవలను అందించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలితకుమారి, ఎంపీటీసీ రమేష్, వెంకటరావు, వ్యవసాయ శాఖ అధికారి సుబ్రమణ్యం, ఈవో పీఆర్‌డీ శ్రీనివాసరావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే ఆధార్ అప్‌డేట్

గుంటూరు రూరల్: దివ్యాంగుడి ఇంటి వద్దకే వెళ్లి అప్డేట్ అయిన ఆధార్‌ను వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి గ్రామ సచివాలయం సిబ్బందితో కలిసి శనివారం అందజేశారు. వెంగళాయపాలెం గ్రామానికి చెందిన షేక్ శహబాష్ ఆధార్ అప్డేట్ కాకపోవడంతో.. పెన్షన్ తదితరాలకు ఇబ్బంది పడుతున్నాడు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆధార్ అప్‌డేట్‌కు అర్జీ చేసుకోగా ఇంటివద్దకే గ్రామ సచివాలయం ఉద్యోగులు, వైస్ ఎంపీపీ ఆధార్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటూరి అంజిరెడ్డి తదితరులున్నారు.

పెదనందిపాడు కళాశాలలో ఏఎన్‌యూ బృందం



పెదనందిపాడు: పీఏఎస్ కళాశాలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అఫిలియేషన్ కమిటీ సభ్యులు శనివారం సందర్శించింది. ఏఎన్‌యూ అఫిలియేషన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్, మెంబరు ప్రొఫెసర్ డి.రామచంద్రన్ అందులో ఉన్నారు. పీఏఎస్ కళాశాలలోని క్లాస్ రూమ్స్, ల్యాబ్స్, లైబ్రరీ, ప్లే గ్రౌండ్ బాగున్నాయని తెలిపారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ వీర రాఘవయ్య, కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలకు విశేష స్పందన



గుంటూరు ఎడ్యుకేషన్: పొత్తూరులోని అక్షర స్కూల్లో శనివారం జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్ని నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్లు నందమూరి సౌగంధ్ కృష్ణ, దీప్తి పోటీల్ని ప్రారంభించారు. గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ డీఎస్ క్రిస్టోఫర్, కార్యదర్శి డి.అశోక్‌తో పాటు అధ్యక్షుడు కనమర్లపూడి సత్యనారాయణ పాల్గొని పోటీల్ని నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి బాలికలు అండర్-8, 10, 12 విభాగాల్లో దాదాపు 100 మందికి పైగా పాల్గొన్నారు. పలువురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు సర్టిఫికెట్లు, పతకాల్ని అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె. సంపత్‌బాబు, మీరావలి, అర్జునరావు, రుకేష్, రవిరాజా బాబు, వంశీ, ఆర్య, ఇశ్రాయేలు, రాజేష్ పాల్గొన్నారు.

వీవీఐటీలో వై-20 యూత్ టాక్ సదస్సు



సదస్సుకు విచ్చేసిన ప్రముఖులతో కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, విద్యార్థులు

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జీ-20 యూత్ విభాగం, వై-20 సంయుక్త ఆధ్వర్యంలో వై-20 యూత్‌టాక్ సదస్సు నిర్వహించారు. నంబూరు వీవీఐటీలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వై-20 విభాగాధినేత దేవాన్ష్ షా విచ్చేశారు. ఈ సదస్సులో ఇండస్ట్రీ 4.0 పారిశ్రామిక అవసరాలు, 21వ శతాబ్దపు నైపుణ్యాలు, భవిష్యత్తు ఉపాధి అవకాశాల కోసం యువత ఏ విధంగా సన్నద్ధం కావాలి అనే అంశాలపై చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఛాట్ జీపీటీ వంటి నూతన సాంకేతికత, వాటి పనితీరు, ఉపాధి వినియోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దేవాన్ష్ షా మాట్లాడుతూ నూతన సాంకేతికత ఉద్యోగ అవకాశాలను వివరించారు. వీవీఐటీ వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తృత అవకాశాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగాలపై చర్చించేందుకు ఈ సదస్సు దోహదపడిందన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న విద్యార్థులు పలు సాంకేతిక అంశాలపై ప్రశ్నించి, వక్తల నుంచి సమాధానాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో మైక్రోసాఫ్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ వినయ్ నందిన, అమెజాన్ ఆపరేషన్స్ మేనేజర్ యశ్వంత్ సాయి పాల్గొన్నారు. వక్తలను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి అభినందించారు.

జీజీహెచ్‌లో కోత, కుట్టులేని ఆపరేషన్



ఆపరేషన్ చేయించుకున్న వృద్ధుడితో సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్య విభాగంలో కోత, కుట్టులేని ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా చేశారు. ఈ సందర్భంగా శనివారం జీజీహెచ్‌లో జరిగిన సమావేశంలో డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడారు. గుంటూరు రూరల్ మండలం ఏటుకూరుకు చెందిన 76 సంవత్సరాల ఆవుల వీరాస్వామి పచ్చ కామెర్ల వ్యాధితో బాధపడుతూ ఈనెల 14న గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీకి వచ్చారన్నారు. రోగికి అల్ట్రాసౌండ్, సిటీస్కాన్ పరీక్షలు చేసి పసరుతిత్తు నాళంలో మూడు సెంటీమీటర్ల పరిమాణం గల రాళ్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వాటిని ఎండోస్కోపీ ద్వారా కోత, కుట్లు లేకుండా తొలగించినట్లు చెప్పారు. రూ. లక్ష నుంచి రూ. లక్షన్నర ఖరీదు చేసే ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్‌ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేసి వృద్ధుడికి వ్యాధి నుంచి విముక్తి కల్పించామని వివరించారు. సమావేశంలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ నికోలస్ పోలయ్య, డాక్టర్ విష్ణు మహేష్ పాల్గొన్నారు.

గర్భిణుల వద్దకే వైద్యులు వెళ్లాలి

గర్భిణుల వద్దకే వైద్యులు వెళ్లాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. శనివారం గైనకాలజీ వైద్య విభాగాన్ని తనిఖీ చేశారు. గర్భిణుల్ని విభాగానికి పిలిపించి వైద్యులు బీపీ చూస్తున్నారని, ఇది మంచి పద్ధతి కా దని తెలిపారు. గర్భిణులకు కేటాయించిన వార్డుల్లో పీజీ వైద్యులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులు, హౌస్ సర్జన్లు వెళ్లి బీపీ చూడాలని ఆదేశించారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

జీజీహెచ్‌లో రోగులకు రోటరీ క్లబ్ సభ్యుల సేవలు అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అభినందించారు. శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రభుత్వంతో పాటు, సేవాసంస్థలు కూడా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు డాక్టర్ ప్రసన్న యశస్వి, మాజీ గవర్నర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ యశస్వీ రమణ, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ అధ్యక్షురాలు మద్ది రాధా, కార్యదర్శి మెహతా ఖాన్, మాజీ జిల్లా గవర్నర్ శివ, పద్మజ, డాక్టర్ చింతా వాసవి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడ్ని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల వాహనాల్ని పోగొట్టుకున్న పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు రత్నగిరి కాలనీకి చెందిన వెంకటేష్‌ను శనివారం అదుపులోకి తీసుకుని విచారించారు. అతని నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు పంపారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు ఉండాలి..

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని నగరపాలెం సీఐ ఎం.హైమారావు సూచించారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో శనివారం విద్యార్థి నాయకుల పదవీ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ హైమారావు విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణ, సచ్ఛీలత్వవర్తన, గురుభక్తి, దేశభక్తిని పెంపొందించుకుని, ఉత్తమ విద్యావంతులు కావాలని సూచించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని చెప్పారు. సెల్‌ఫోన్ ఉపయోగించకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాల కార్యదర్శి పి. గోపాలరాజు, కోశాధికారి ప్రసాద్, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్‌ఎం ఉషశ్రీ పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి సదస్సు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవటం వల్ల భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగావకాశాలు సులువుగా పొందవచ్చని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. మూడు రోజులుగా నగర శివారురులోని లాం నందున్న కళాశాలలో కళాశాల, సిగ్నల్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి సిగ్నల్, ఇమేజ్ ప్రాసెసింగ్‌పై అవగాహన సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.సునీత మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యతలకు మెరుగులు దిద్దుకుని ఉజ్వల భవిష్యత్తును పొందాలన్నారు. ఆర్‌వీఆర్‌జేసీ ప్రొఫెసర్ డాక్టర్ సత్య సాయిరామ్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ రంగంలో సిగ్నల్ సిస్టం ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల సెక్రటరీ సుజిత్ కుమార్, డాక్టర్ కేవీ రామారావు, డాక్టర్ ఎం రజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

అర్థ శాస్త్రంలో విస్తృత ఉద్యోగావకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: అర్థ శాస్త్ర అధ్యయనం ద్వారా విస్తృత రీతిలో ఉద్యోగావకాశాలు పొందవచ్చని ఏఎన్‌యూ అర్థ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య మధుబాబు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల అర్థ శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో శనివారం అతిథి ఉపన్యాసమిచ్చారు. దేశ ఆర్థిక విధానాల రూపకల్పనతో పాటు కంపెనీల వ్యాపార నిర్ణయాల్లో అర్థ శాస్త్రవేత్తలు కీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్ మాట్లాడుతూ డిగ్రీ విద్యా విధానంలో చోటు చేసుకున్న మార్పులతో సింగిల్ మేజర్ విధానం అమల్లోకి వచ్చిందని చెప్పారు. ఆయా మార్పులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అర్థ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.వేణుగోపాల్, అధ్యాపకురాలు షేక్ హసీనా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో దురాగతాలకు మోదీ, అమిత్ షాలదే బాధ్యత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న క్రైస్తవ, ముస్లిం సంఘ నాయకులు

నెహ్రూనగర్: మణిపూర్‌లో కుకీ జాతికి చెందిన క్రైస్తవులపై విచక్షణారహితంగా దాడులు, మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటనలకు ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్(ఐక్య) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు పేర్కొన్నారు.యూసీసీ(యూనిఫైడ్ సివిల్ కోడ్)పై అవగాహన సదస్సుతో పాటు మణిపూర్‌లో అల్లర్లకు నిరసనగా శనివారం అంబేడ్కర్ భవన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో సంఘటనలు, పాస్టర్లను హతమార్చడం పథకం ప్రకారమే జరుగుతున్నాయని ఆరోపించారు. మోదీ ప్రధాని అయినప్పటి నుంచి క్రైస్తవులు, ముస్లింలపై దాడులు అధికమయ్యాయని మండిపడ్డారు. మణిపూర్‌లో అమానుషాలు జరుగుతున్నా ప్రధాని మోదీ చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.మణిపూర్‌లో దురాగతాలు, యూసీసీని బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 30న నగరంలోని ఏసీ కాలేజీ నుంచి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

బీజేపీ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలి: సీపీఐ

పాత గుంటూరు: మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసిన వ్యక్తుల్ని శిక్షించాలని కోరుతూ శనివారం లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లపై స్పందించేందుకు ప్రధానికి తీరిక లేకపోవడం దారుణమని ఖండించారు. మహిళలకు రక్షణ కల్పించలేని నరేంద్ర మోదీ డౌన్.. డౌన్ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్, చల్ల మరియదాస్, బండారుపల్లి యశ్వంత్, జి. సురేష్ బాబు, సమితి సభ్యులు పాల్గొన్నారు.